

## [తొమ్మిదవ భాగము]

"యూ ఆరే డేంజరస్ మేనియక్ మిస్టర్ కోబ్రా!" దడాలున పైకిలేచాను కుర్చీని వెనక్కి గెంటి "నువ్వో మానసిక వ్యాధిగ్రస్తుడివి. నీలాంటి వాడు బ్రతికి వుండడం నీ చుట్టుపక్కల మనుషులకు అపాయకరం.... అది నీకు తెల్సు?" అర్చాను ఆవేశంగా ఊగిపోతూ.

తొణుకు, బెణుకు లేకుండా శామ్‌గా నాకేసి చూశాడు కోబ్రా.

"మిస్టర్ భయంకర్! నేనా కోరికను చంపుకోలేక పోతున్నాను. ఇది నాలుగు సంవత్సరాలుగా రోజురోజుకీ పెరుగుతూ వేధిస్తున్న కోరిక! నువ్వు నన్ను 'మానియాక్'

అన్నా, ఏ పేరుతో పిల్చినా సహిస్తాను. కాని నా కోరిక నీద్వారా తీరాలి. ఐ వాంట్ టు గెట్ డన్ బై యూ! నీకు గుండె బలం వున్నదని చెప్పావ్!"

"వాట్ ది హెల్ అర్యూ టాకింగ్ మిస్టర్ కోబ్రా! యిలాంటి అతి నీచపు, దౌర్భాగ్యపు పని చేయించడానికా నా గుండె దిటవును, ధైర్యాన్ని కొల్చుకున్నావ్? ఈ విషయం నీ నీగ్రో అనుచరులకు తెలిస్తే ఏమౌతుందో తెల్సా?" కోపోద్రేకాలతో ఊగిపోతూ అడిగాను.

"కామ్ డౌన్ మిస్టర్ భయంకర్! వాళ్ళు విశ్వాసపు జంతువులు. నువ్వా విషయం వాళ్ళకు చెప్తే నిన్ను పిచ్చి వాడికింద జమకడ్తారు. పైగా యజమానిపై చాడీలు చెప్పావని నిన్ను చంపడానిక్కి నా అనుమతి అడుగుతారు. అలాంటి కట్టుబాట్లు వారివి.

"అంతేకాదు నీలాగే ఓ సంవత్సరం నల్గురు టూరిస్టులు ఈ అడవిలో చిక్కుకున్నారు. వాళ్ళు నా కోరిక తీర్చడానిక్కి ఒప్పుకోలేదు. దానికి ప్రతిఫలంగా బందీలై దిక్కులేని ఆకలి చావు చచ్చారు" ఆఖరి మాటలంటున్నప్పుడు కోబ్రా ముఖం క్రూరంగా మారింది.

"అయ్ కాంట్ హెల్ప్ మై సెల్ఫ్. ఈ కోరిక రాత్రివేళల్లో ఎక్కువైపోతోంది నాకు. నిద్రరాని రాత్రుళ్ళు ఎన్నో వున్నాయి. అందుకే_ఈ దఫా అది అమల్లోకి వచ్చితీరాలి."

"మిస్టర్ కోబ్రా! నిన్ను అనవసరంగా ఎక్కువగా ఊహించుకున్నాను." అన్నాను ఊగిపోతూ.

"నీ ఊహలకు, నిగ్రహాలకు నేను బాధ్యుడ్ని కాను మిస్టర్ భయంకర్!"

"ఈ దారుణాన్ని అన్నం తినే మనిషెవడూ వప్పు కోడు."

"వప్పుకోకపోతే ఆ అన్నంలేక దిక్కులేని చావు చస్తావ్ మిస్టర్ భయంకర్."

"నా ఒంట్లో చీము, నెత్తురు వున్నాయి. దానికి చస్తే ఒప్పుకోము. రాక్షసత్వం యిది. ఇటీజ్ జస్ట్ ఎ సావేజ్ లస్ట్" అన్నాను దిక్కులు పెక్కటిల్లే స్వరంతో.

మా యిద్దరిమధ్యా కాస్సేపు చావు నిశ్శబ్దం ఏర్ప డింది. కొద్ది నిముషాల క్రితం యిద్దరం నవ్వుతూ మాట్లాడు కున్నాం. యిప్పుడు ఆ నవ్వూ, ఆ నిర్మలత్వం, స్నేహ వాతావరణం లేవు.

అసహ్యం పుడుతోంది అతనిపై నాకు.

కోబ్రా అసలేమీ జరగనట్టు మౌనంగా డైనింగ్ టేబుల్ ముందునుంచి లేచాడు. ఓసారి నావైపు చూసి, తానో సిగరెట్ పెదిమల మధ్య పెట్టుకున్నాడు. అగ్గి పుల్లతో సిగరెట్ ముట్టించి, వ్రేళ్ళమధ్య కాలుతున్న అగ్గిపుల్లకేసి చూస్తూ పలికాడు.

"మిస్టర్ భయంకర్! నువ్వేదో మాట్లాడావ్ ఆవే శంలో. అది నేనూహించిన పరిణామమే కాబట్టి అన్యధా భావించడం లేదు. అదంతా మర్చిపోతున్నాను. పోతే_ రెండ్రోజులు టైం యిస్తున్నాను నీకు. నేనడిగిన విషయం పైన_నీ నిర్ణయం తీసుకోడానికి ఆ వ్యవధి చాలను కుంటాను.

"ఆ రెండ్రోజుల్లో యిక్కడ్నుంచి తప్పించుకోవా లనే ఆలోచన నీలో పుడుతుంది. పారిపోడానికి ప్రయత్నించొద్దని నేననను. ప్రయత్నించి అది ఎంత

అసాధ్యమో తెల్సుకో. యూ ఆర్ మెంటల్లీ టైర్డ్. యిప్పుడు నువ్వు నా గదికి వెళ్ళి విశ్రాంతి తీసుకొంటావ్.'' అగ్గిపుల్లని బూటుకాలితో నొక్కుతుండాగా అక్కణ్నించి బయటికి నడిచాడు కోబ్రా.

స్థాణువులా నిలబడిపోయాను కోబ్రా మాటలకు.

* * *

అర్థరాత్రి దాటుతోంది.

బయట వర్షం పడ్తోంది.

నీరు చూరుమీంచి జారి, నేలమీద పడుతున్న శబ్దం...నిద్రపట్టలేదు.

కోబ్రా కుటీరంలో నాకు కేటాయించబడిన గదిలో, మెత్తని తోళ్ళు కప్పిన నులక మంచంమీద కూర్చుని యిబ్బందిగా కదుల్తున్నాను.

మస్తిష్కం కోబ్రా దౌర్భాగ్యపు కోరిక గురించి ఆలోచిస్తూ తననొప్పి పుట్టిస్తోంది...

నా మంచానికి పక్కగా కిటికీ...

తలుపుల్లేవు వాటికి.

అడ్డంగా నిలువుగా చెక్కబడిన కొయ్యముక్కలు దిగ్గొట్టబడ్డాయి. గాలి రివ్వున వీస్తోంది కిటికీలోంచి లోపలికి.

బయట అప్పుడప్పుడు భయంకరంగా మెరుపులు మెరుస్తున్నాయి...

ఉరుముల శబ్దం దానితో ఐక్యంగా వెలువడుతోంది.

మెరుపుల కాంతిలో వర్షం స్పష్టంగా అవుపిస్తోంది.

నేను మనిషిని.

నాగరికుడెవ్వడూ కోబ్రా కోరిక తీర్చలేడు.

తీరిస్తే తిరిగి ఆ మనిషి రాతియుగంనాటి మానవ దశలోకి వెళ్ళినట్లే!

పోనీ పారిపోతామంటే...ఎలా? హౌ కెన్ ఐ ఎస్కేప్?

కోబ్రా మాటలు బట్టి—

అతను తగిన కట్టుదిట్టాల్లో ఉన్నట్లు గ్రహించవొచ్చు.

ఒకవేళ పారిపోవడమంటూ జరిగితే—

మళ్ళీ నిరాహారంగా...నిరాయుధంగా...

కాళ్ళీడ్చుకుంటూ ఎన్నివందల మైళ్ళు నడవటం?

కనీసం యిప్పుడు ఖాళీ తుపాకీ కూడా తనవద్ద లేదు.

బయట ఒక్కసారిగా భయంకరంగా ఉరిమింది.

ఎక్కడో పెద్ద శబ్దం...

ఫ్లాష్‌లైట్ కాంతి తళుక్కున మెరిసింది.

ఆ మెరుపులో...

నాకు ఓ ఆకారం కనబడింది.

ఆ ఆకారం బయట మెట్లవేపు అటూ ఇటూ కదలం ఆ క్షణంలో నేను చూశాను. ఆ ఒక్క క్షణం కాంతిలోను ఆ ఆకారం ముఖాన్ని గమనించాను. నా గుండె ఒక్కక్షణం కొట్టుకోడం మానేసింది.

ఆమె...ఆమె...శాన్యోరాయేనా?

మరోసారి మెరుపు మెరిసింది—పెద్ద శబ్దం వెనుక. కళ్ళు చిట్లించాను.

గుండెలు గుబగుబలాడాయి.

ఆమే...

ప్రొఫైల్ యాంగిల్‌లో ముఖం కనబడింది.

షీ ఈజ్ శాన్యోరా! అవే వంపుసొంపులు!! తడిసిన తెల్లని దుస్తుల్లో జుట్టు విరబోసుకొని గబగబా గేటువైపు నడుస్తూ కనబడిందామె.

శాన్యోరా...!!

శాన్యోరా బ్రతికే వున్నదా?

కంగారుగా నడువాల్సిన అవుసరం??

ఆమె శాన్యోరా అయివుంటే ఈ అర్ధరాత్రి వర్షంలో...??

నా బుర్ర పగిలిపోతోంది ఆలోచనల్తో.

నా కళ్ళను నేనే నమ్మలేకపోతున్నాను.

తొడమీద గట్టిగా గిల్లుకున్నాను.

నొప్పి తెల్సింది.

డామిట్! కలకాదు.

అయ్ హావ్ సీన్ శాన్యోరా!

నా ప్రియురాలు, నా ఆరాధ్య దేవత శాన్యోరా బ్రతికే వున్నదా?

యిక ఆలస్యం చేయదల్చుకోలేదు.

చేతిలోని సిగరెట్ విసిరికొట్టి తటాలున పైకి లేచాను.

రగ్గు ఎగిరిపడింది.

తలగడ క్రిందవున్న టార్చిలైట్ చటుక్కున తీసాను.

మరో మెరుపు!

ఉలిక్కిపడి ఆశగా అటువైపు చూసాను.

కర్రగేటు కిర్రు కిర్రుమంటూ కదుల్తోంది!

ఆ గేటుకి అవతలగా అడివిలోకి గబగబా నడుస్తున్న తెల్ల చీర!

మళ్ళీ చీకటి...

ఎందుకో నా గుండెలు గుబగుబలాడుతున్నాయి.

నోరు అప్పటిదాకా ఎందుకు పెగల్లేదో నా కర్థం కాలేదు.

గది తలుపు గడియ తీసి మెరుపులా బైటికి లంఘించాను.

మెట్లమీంచి హై జంప్ చేసాను.

పాదంవద్ద అప్పుడే మానిన గాయం కలుక్కుమంది.

గేటువద్దకు పరిగెత్తాను.

గేటు తియ్యనక్కర్లేకుండా గాలికి అదే వెనక్కి తెరుచుకుంది.

"శాన్వీరా!" ఒక్కచోట ఆగి బిగ్గరగా అరిచాను. నా చేతిలోని ఫైవ్ సెల్స్ టార్చి—చెట్ల మధ్యకు అర్థ వలయంగా సర్వే చేసింది.

తెల్లచీర కనబడటం లేదు!

ఆమె అటువైపే వెళ్ళింది! సందేహం లేదు!

ఆఖరిసారి చీర కనబడినప్పుడు దారి గుర్తుపెట్టుకున్నాను మస్తిష్కంలో.

గబగబా అటువైపే ముందుకి పరిగెత్తాను.

టార్చి ముందుకు దారి చూపుతోంది. వర్షం పడుతూనే వుంది. బట్టలు అప్పటికే తడిసిపోయాయి. ఏవో కీటకాలు కదుల్తూ కన్పిస్తున్నాయి, టార్చి కాంతిలో.

"శా..న్వీ..రా!" నోటి చుట్టూ చేతులుపెట్టి పొలికేక పెట్టాను పిచ్చాడిలా.

నా గొంతుక ఆ అరణ్యంలో ప్రతిధ్వనించింది హేళనగా. కళ్ళకడ్డుపడిన తడి జుట్టు నుదుటిమీదుగా

తోసుకుంటూ ఎడంచేత్తో టార్చి మళ్ళీ అర్థవలయంగా త్రిప్పాను.

నా కళ్ళు మెరిసాయి.

కుడివైపు...

అల్లంత దూరంలో మరమనిషిలా వెళ్ళిపోతోంది తెల్ల చీర ఆకారం. "కాన్యోరా! స్టాప్ దేర్!" వెర్రికేక పెట్టాను వెనకనించి.

వర్షం పడుతున్నట్టే గుర్తించనట్టుంది ఆ ఆకారం నడక చూస్తుంటే.

ఆమె కాన్యోరాయేనా?

అయితే తన మాట ఎందుకు వినిపించుకోదు??

వర్షం తుప్పర్లలోకి తగ్గింది.

ఆమె వెనకాల భాగం మాత్రం కనబడ్తోంది నాకు.

ముఖం కనబడ్డంలేదు.

అయినా ఆమె కాన్యోరాయే!

షీ ఈజ్ కాన్యోరా!

షీ మస్ట్ బి కాన్యోరా!

ఆమె నడక గుర్తించలేని మూర్ఖుణ్ణి కాను నేను.

కసిగా పరిగెట్టాను ఆమెవైపు.

ఓ వెడల్పాటి చెట్టువేపు గబగబా అడుగులు వేసింది ఆ ఆకారం. చటుక్కున చెట్టు వెనక్కి గెంతింది.

తడిసిన నేలమీద శబ్దం చేసుకుంటూ పరిగెట్ట సాగాను ఆవైపు.

టార్చి కాంతి చెట్టు అవతలివేపు ప్రసరింపచేసాను.

నా గుండె ఝల్లుమంది...

అక్కడ...

అక్కడ.

శాన్యోరా లేదు...

ఎంతో సేపు కాలేదు ఆమె ఆ చెట్టువద్దకు వొచ్చి.

మాక్సిమమ్ అరనిముషం!

ఎక్కడ మాయమైంది అంతలో??

చెట్టు చుట్టూ పరీక్షించాను నేలను...

అడుగు జాడలు చెట్టుదాకా వచ్చి—ఆగిపోయాయి.

ముందుకు లేవు ఫుట్ ప్రింట్స్.

ఎలా సాధ్యం?

ఎక్కడ మాయమైంది?

అంతలో ఏదో ఆలోచన మెరిసింది మెదడులో!

చెట్టుపైకి వేసాను లైటుని.

చ్ఛ!

పైకి ఎక్కాను గబగబా...

ప్రతి కొమ్మని వెతికేసాను పిచ్చివాడిలా.

"శాన్యోరా! శాన్యోరా!" భయమయిన కంఠంతో పిలుస్తూనే వున్నాను ఆశగా.

పావుగంట తర్వాత చెట్టు దిగాను.

చినుకులు పడుతూనే వున్నాయి.

అలాగే పిచ్చి చూపులు చూస్తూ చినుకుల మధ్య నిలబడిపోయాను తడుస్తూ, "ఎక్కడికీ తప్పించుకోలేవ్" అంటూ యిద్దరు నీగ్రోలు ప్రత్యక్షమై నన్ను వెనక్కి లాక్కెళ్ళేవరకూ.

* * *

ఉదయం—ఏడు గంటలు చూపుతోంది కోబ్రా కుటీరంలోని గోడ గడియారం.

"మిస్టర్ భయంకర్! రాత్రి నువ్వు తప్పించుకోవాలని చూసావ్!" అన్నాడు కోబ్రా నవ్వుతూ.

"మిస్టర్ కోబ్రా!" ఉద్వేగంగా పలికాను.

"యస్. మిస్టర్ భయంకర్!"

"రాత్రి కాన్సోరాను చూశాను."

"కాన్సోరా?"

"ఎస్. కాన్సోరా. నా ప్రియురాలు."

"ఓహ్! జ్ఞాపకం వచ్చింది. ఎక్కడ?"

"మెట్లమీంచి దిగి గేటు తెరచుకుని ఆమె బయటకి నడవడం నేను చూశాను.

"ఎక్కడ మెట్లు?"

"ఈ యింటి మెట్లు."

కోబ్రా మౌనంగా నిలబడి సిగరెట్ ముట్టించాడు.

"మిస్టర్ భయంకర్! యిదే నెలా?" అడిగాడతను.

"ఏప్రిల్" అన్నాను వింతగా చూస్తూ.

"తారీఖు?"

"ఒకటి" అన్నాను గోడగడియారం చూసి.

"డోంట్ మేక్ మి ఏప్రిల్ ఫూల్!"

అకస్మాత్తుగా అర్చాడు కోబ్రా, కోపంగా.

"నవ్వుతో తప్పించుకోడానికి ట్రై చేసానని."

"స్టాప్ యువర్ బార్కింగ్ మిస్టర్ కోబ్రా!" పలికాను గంభీరమైన మిలట్రీ కంఠంతో.

"నేనూ అరవగలను నీలా. కాని పాయింట్ లెస్ గా మాట్లాడక. నా కళ్ళతో నేను చూసానామెను. తెల్లదుస్తుల్లో ... షీ మస్ట్ బి కాన్సోరా! ఎక్కడ దాచావ్ ఆమెను?"

"తెల్లదుస్తులు?"

"ఎస్స్! ఇన్ వైట్ శారీ!"

పగలబడి నవ్వాడు కోబ్రా. "యిప్పుడు అర్థమైంది" అంటూ నవ్వుతూ చప్పట్లు కొట్టాడు.

గదిలోనికి ఓ నీగ్రో వచ్చి తలవొగ్గి నిలబడ్డాడు.

"బాసాంబో! మీ అందరి పెళ్ళాలనీ తీసుకురా! గెట్ లాస్ట్!"

అతను మళ్ళీ తలవంచి వెనక్కు మళ్ళాడు.

"కోబ్రా! ఏవిఁటది?" అన్నాను అర్థం కానట్లు చూస్తూ.

"పేషన్స్ మిస్టర్ భయంకర్! వెయిట్ ఫర్ ఎ మినిట్!"

మౌనంగా ఉండిపోయేను.

అయిదు నిముషాల్లో యిరవైమంది నీగ్రో యువతులు వరుసగా లోనికి వచ్చారు.

త్రుళ్ళిపడుతూ వారివేపు చూసాను.

"మిస్టర్ భయంకర్! వీళ్ళంతా నాక్రింద పనిచేస్తున్న సేవకుల పెళ్ళాలు. నా యింటిచుట్టూ అక్కడక్కడా వీరికి 'బాండా' అని పిలువబడే కాటేజీలు కట్టించబడ్డాయి. వీళ్ళు ధరించిన చీరలు క్రిందటిసారి నేను యింగ్లండ్ వెళ్ళినప్పుడు తెచ్చి ప్రెజెంట్ చేసిన ఇంపోర్టెడ్ నైలెక్స్ చీరలు. అవి వాళ్ళు ఎంతో ప్రేమతో కట్టుకుంటారు. వీరిలో ఎవరినైనా రాత్రి నువ్ చూసి ఉంటావ్. అయామ్ ష్యూర్ ఆఫ్ యిట్! ఎందుకంటే" అంటూ ఆగిపోయాడు.

"ఎందుకు?"

కోబ్రా మెల్లిగా నా దగ్గరకు వచ్చేడు.

"...ఎందుకంటే ... వాళ్ళలో కొంతమందిని నేను వాడుకుంటాను. నేనంటే మోజు వాళ్ళలో చాలమందికి. నిన్న రాత్రి నా దగ్గరకి ఓ నీగ్రో యువతి వచ్చిన మాట నిజం." అన్నాడు తగ్గు స్వరంతో.

అదిరిపడుతూ అతనివైపు చూసాను.

"ఈ విషయం వాళ్ళ భర్తలకు తెలిస్తే?" ఆశ్చర్య పోతూ లోగొంతుకతో పలికాను.

"తెలుసు..."

"వ్వా...ట్?"

"ఎస్సి డెనో. అవన్నీ నీకనవసరం. వారి సాంప్రదాయాలు అవీ నీకు తెలియవ్. అవన్నీ యిప్పుడు చెప్ప లేను."

నీగ్రో యువతులవేపు చూసాను.

"మీరంతా వెళ్ళిపొండి" అరచాను.

వాళ్లు కదల్లేదు.

నవ్వుతూ కోబ్రా వేపు చూస్తున్నారు.

"మీరు వెళ్ళొచ్చు" అన్నాడు కోబ్రా.

మరుక్షణం వాళ్ళంతా గౌరవంగా తలవంచి వరుసిగా నిష్క్రమించారు.

అప్పుడే ఓ విషయం చటుక్కున గుర్తుకొచ్చింది.

"మిస్టర్ కోబ్రా!" పిల్చాను.

"ఎస్" అన్నాడతను, టేబుల్ మీద కాఫీ కెటిల్ వేపు కదుల్తూ.

"రాత్రి నేను చూసింది ఈ స్త్రీలలో ఎవ్వరినీ కాదు" అన్నాను దృఢంగా.

(సశేషం)